# అంతరాత్మ

ఆపదలో వున్నవాడి మానసిక స్థితిని ఏ రచయితా వర్ణించలేడు. ఉదయంనుండి శంకరరెడ్డి మనసులో ఎంత ఆరాటమున్నదో అతనికే తెలుసు. అది కేవలం అనుభవైక వేద్యం.

ఉన్నట్టుండి పెళ్ళానికి ప్రమాదం ముంచుకవచ్చింది. తను ఉన్న వూళ్లో గవర్నమెంటు హాస్పిటల్ వుంది మనిషి చచ్చి బ్రతికితే ఆశ్చర్య పడ నక్కర్లేదు. సీరియస్‌కేసు ఏదన్నా ఆ హాస్పిటల్‌నుంచి బయట పడితే ఆశ్చర్యపడాలి!

అవన్నీ ఆలోచించిన మీదట, భార్యని ఆ హాస్పిటల్లో చేర్పించ డానికి శంకరరెడ్డి మనస్కరించలేదు.

డబ్బుపోతే పోయిందని, టాక్సీ మాట్లాడి భార్యని, 15 మైళ్ళ దూరాన వున్న మిషన్ హాస్పిటలుకు తెచ్చాడు.

"మీరు కాస్త ముందు తీసుకరావలసింది," అన్నాడు డాక్టరు.

అది డాక్టర్ల మామూలుమాట. అక్కడికే తను త్వరపడ్డాడు. నిర్లక్ష్యం చేయలేదు.

"నమ్మకం లేదంటారా?" అతని గొంతు పెగలడమే కష్టమై పోయింది.

"చెప్పలేం. సీరియస్‌కేసు, ప్రయత్నిస్తాం. 48 గంటలు గడిస్తే ఫరవాలేదు," అన్నాడు డాక్టరు.

ప్రాణాలు గంటలమీదున్న విషయాన్ని డాక్టర్లు సులభంగా చెబు తారు. వింటున్న శంకరరెడ్డికి గుండెలు పట్టుకున్నాయి. నాలుక పిడుచ కట్టుకపోయింది. దాదాపు బాహ్యప్రపంచజ్ఞానమే కోల్పోయాడు.

రోగిని రూములోకి తీసుకెళ్ళి 'నార్మల్ సెలైన్' ఎక్కించే ప్రయత్నం చేస్తున్నారు. అస్పష్టంగా బయటకు మూల్గులు వినిపిస్తున్నాయి. శంకరరెడ్డికి దుఃఖం ఆగక కళ్ళలో నీళ్ళు మెదిలాయి.

అంతా అయిన తర్వాత ఆమెను వార్డుకు తీసుకెళ్ళారు. శంకరరెడ్డి యాంత్రికంగా వార్డులోకి వెళ్ళాడు. డాక్టరు ఇంజక్షన్ చేసి, తర్వాత వాడవలసిన మందులు నర్సుతో చెప్పి వెళ్ళిపోయాడు.

"ఈమెకు సంబంధించి ఆడవాళ్ళు ఎవరూ రాలేదా ?"

శంకరరెడ్డి తలెత్తి చూశాడు. నర్సు అడుగుతోంది. ఎవరూ రాలేదు తను ఒక్కడే వచ్చాడు. ఎవరూ రాలేదని చెప్పడంకూడా అతనికి సాధ్యం కాలేదు. ఆ విషయం నర్సు గ్రహించింది.

"ఆడవాళ్లు ఎవరన్నా ఉంటే రోగి దగ్గర ఉండవచ్చు, ఎవరూ లేకపోయినా పర్వాలేదు. మేం ఉన్నాం, మీరు వెళ్ళండి," అన్నది. శంకరరెడ్డి తలొంచుకొని బయటికి వచ్చాడు. ఆ వార్డు ఎదురుగా చిన్న హాలుంది. రోగులు తాలూకా మనుషులు అక్కడ వున్నారు. శంకరరెడ్డి బెంచీమీద కూలబడ్డాడు. శంకరరెడ్డి లాంటివాళ్లు చాలామంది వున్నారు అక్కడ. శంకరరెడ్డికి ఎవరూ కనిపించడంలేదు. సిగరెట్టుతీసి వెలిగించాడు, గడియారం చూసుకున్నాడు. ఎనిమిదిన్నరయింది. అతను ఒకసారి గంటలు లెక్కించుచున్నాడు. 48 గంటలు. ప్రతి గంట లెక్కపెడుతూ కూచున్నాడు. ఒకోగంట ఒక యుగంలావుంది.

ప్రతి గంటగంటకీ వార్డులోకి వెళ్తున్నాడు. ఐదు నిముషాలుండి చూసి మరీవస్తున్నాడు. అతని స్థితి చూసి ఎవరూ ఆటంకపరచలేదు.

ఆ పగలు అట్లాగే గడిచింది. రాత్రికూడా శంకరరెడ్డి బెంచీమీద నుంచి కదలలేదు. ఉదయంనుంచి పచ్చి మంచినీళ్ళుకూడా ముట్టుకోలేదు. సిగరెట్లు తాగి తాగి పైత్యం చేసింది. కళ్ళు తిరుగుతున్నాయి. అయినా శంకరరెడ్డికి దేనిమీదా ధ్యాసలేదు.

శంకరరెడ్డికి రాత్రయ్యేసరికి భయం పట్టుకుంది. భార్యని ఒకసారి అలా చూచివచ్చి హాల్లో కూచునేవాడు. అర్థగంట గడిచేసరికి అతనికి

తాపత్రయం ఎక్కువయ్యేది. వార్డులోనుంచి ఏవో మాటలు వినిపించేవి. తన భార్య చచ్చిపోయిందనీ,-ఆమెను గురించే మాట్లాడుతున్నారనీ అనిపించేది. గబ గబ వెళ్లేవాడు. తీరా అక్కడికెళ్తే ఏమీలేదు ఆమె ప్రశాంతంగా మంచంమీద పడుకొని వుంది. రోగులు నిద్రపోతున్నారు.

ఆ క్షణాన తను వూహించినది జరగనందుకు-శంకరరెడ్డికి గొప్ప రిలీఫ్.

రాత్రి 12 గంటలకువార్డు అంతా ప్రశాంతంగా వుంది, దొడ్డి లోపలికి వెళ్ళేసరికి నర్సు ఏదో చదువుకుంటుంది. శంకరరెడ్డి కాసేపు భార్య తల దగ్గర నిలబడి చూచాడు. బాధగా మూలుగుతుంది. గంటముందు సక్కిల్ ఇచ్చారు. మత్తుగా పడుకుంది. శంకరరెడ్డి బయటికి వస్తున్నాడు. నర్సు పిలిచినట్లనిపిస్తే ఆగాడు. ఆమె దగ్గరికి వచ్చింది. "మీరు మాటి మాటికి ఇలా రాకూడదండీ" అన్నది. శంకరరెడ్డి ఏం జవాబు చెప్పలేదు. దీనంగా ఆమె ముఖంలోకి చూచాడు. అతని దీనత్వం చూచి ఆమె చలించింది.

"పంద్రెండయింది. మీరు కాసేపు పడుకోండి. నేనున్నానుగా ఏం భయం లేదు" అంది.

"ఆమెకి ఫర్వాలేదంటారా ?" అన్నాడు.

"సర్వేశ్వరుడి కృప ఉండాలి" అంటూ జీసస్ పటంవైపు చూపించింది.

శంకరరెడ్డి ఇంకేం మాట్లాడలేదు. తలొంచుకొని బయటికి వచ్చాడు. అతడు నర్సు మాటను లెక్కపెట్టలేదు. గంటగంటకీ వెళ్ళి చూస్తూనే వున్నాడు. తర్వాత ఆ నర్సుకూడా ఏం అభ్యంతరం చెప్పలేదు. ఆ రాత్రి గడిచింది. మరునటిరోజు పగలూ గడిచింది. 36 గంటలు గడిచాయి. ఇంక 12 గంటలు గడవాలి. రాత్రి గడిస్తే చాలు.

తన భార్యకు భయంలేదు. శంకరరెడ్డికి ఏనుగంత బలం వచ్చింది. ఈ ముప్పయి ఆరు గంటలూ - అతని మనసు ఆహారంమీదికి పోలేదు, ఇప్పుడయినా అతనికి అన్నం తినాలనిపించలేదు. ఆకలి చచ్చిపోయింది. గబగబావెళ్ళి కొంచెం ఫలహారం చేసి కాఫీ త్రాగాడు. మళ్ళీవచ్చి హాల్లో

కూర్చున్నాడు. తెల్లవార్లు వార్డుకు కాలుగాలిన పిల్లిలా తిరుగుతూనే వున్నాడు. 5 గంటలకి అతని కళ్ళు మూతలుపడ్డాయి.

ఎవరో తట్టి లేపారు. ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా నర్సు — అతని పై ప్రాణం పయినే పోయింది. ఏదో జరిగింది. అతనినోట మాట రాలేదు. స్థాణువులా నిలబడ్డాడు. ఆమె అతని స్థితి గ్రహించింది.

"ఆమెకు బాగానే వుంది. టెంపరేచరు కూడా తగ్గుముఖం పట్టింది. డాక్టర్ ఇప్పుడే చూచి వెళ్ళాడు. కొన్ని మందులు రాయించాడు. మీరు వెళ్ళి తీసుకురండి అన్నది.

ఆమెకు చేతులెత్తి నమస్కరించాలనిపిస్తుంది ప్రిస్కిప్షన్ కాగితం తీసుకున్నాడు.

ఇప్పుడు అంగళ్ళు తెరవరు. ఇంకో గంట ఆగి వెళ్ళండి. నా డ్యూటీ అయిపోయింది. నేను వెళ్తున్నాను. ఇంకో ఆమెకివ్వండి అన్నది, ఆమె వెళ్ళిపోయింది. మందు తెచ్చి డ్యూటీలో వున్న నర్సుకు ఇచ్చాడు. టెంపరేచరు బాగా తగ్గింది. మన స్మృతికి వచ్చింది. సుషమల్ని గుర్తిస్తోంది. శంకరరెడ్డికి వళ్ళు తెలియని సంతోషమైంది.

మధ్యాహ్నం హాల్లో కూచుని సిగరెట్ తాగుతున్నాడు.

రాత్రి డ్యూటీలోవున్న నర్సు వచ్చింది. "ఎట్లావుంది ఆమెకు" అంది. శంకరరెడ్డి సంతోషంగా పరిస్థితి వర్ణించి చెప్పేడు.

అదృష్టవంతురాలు ఇక భయంలేదు. నాకు రాత్రికి డ్యూటీవుంది. ఎట్లావున్నారో చూచిపోదామని వచ్చా" అంది నవ్వుతూ.

"మీరు చాలా కష్టపడ్డారు" అంటూ తన కృతజ్ఞతను తెల్పాడు.

"మనదేముందండీ డ్యూటీ చెయ్యక తప్పుతుందా ? అన్నది.

"డ్యూటీ చేసేవాళ్ళు ఎంతమంది వుంటారు?"

"ఆ విషయం వదలివెయ్యండి. పెళ్ళాన్ని మీలాగా అందరూ ప్రేమిస్తారా ? అన్నది నవ్వుతూ. శంకరరెడ్డి కొంచెం సిగ్గుపడ్డాడు. తను

పడ్డ ఆదుర్దాను అందరూ గమనించారని ఇప్పుడు తెలిసేసరికి చాలా సిగ్గు కలిగింది. అప్పటి పరిస్థితి వేరు.

"ఆమెకేం ఫరవాలేదు. రెస్టుతీసుకోండి. లేకపోతే మీరు మళ్ళా హాస్పిటల్లో జాయిన్ కావలసి వస్తుంది" అన్నది.

శంకరరెడ్డి తన్ను తాను పరిశీలనగా చూసుకున్నాడు. బట్టలు మాసాయి, గడ్డం పెరిగింది. ముఖం కనిపించడంలేదు. కళ్ళు పీక్కుపోయి అసహ్యంగా ఉన్నాయి. ఇవన్నీ జ్ఞాపకం వచ్చేసరికి చచ్చేంత సిగ్గేసింది.

ఆమె వెళ్ళిపోయింది. శంకరరెడ్డి గబాగబా వెళ్ళి హాస్పిటల్ ఎదురుగా వున్న లాడ్జిలో ఒక రూం తీశాడు. బట్టలూ అవీ వెంట తెచ్చుకున్నాడు. గడ్డం తీసుకొని స్నానం చేశాడు. బట్టలు మార్చుకున్నాడు. కొంచెం శాంతి దొరికింది. రూమ్‌కు తాళం వేసి, వార్డుకు వచ్చాడు. ఏడయింది అప్పుడే నైట్ డ్యూటీ నర్సు వస్తోంది.

శంకరరెడ్డిని చూచి నవ్వింది.

"ఎక్కడుంటున్నారు ?"

శంకరరెడ్డి చెప్పాడు.

"మంచిది ఈ రాత్రికి బాగా నిద్రపొండి" అన్నది. శంకరరెడ్డి వెళ్ళలేదు. పదకొండింటివరకు వార్డులోనే వున్నాడు. ఆ నర్సు, కేసును గురించి చెప్పింది. వాడిన మందుల గురించి, అవి ఏమేమి పనిచేస్తాయో వివరించింది. శంకరరెడ్డి వ్యక్తిగత విషయాలుకూడా అడిగింది, శంకరరెడ్డి ఆమెను ఏమీ అడగలేదు

"మీపేరేమిటి?" అన్నాడు.

"థెరిసా" అంది.

అంతకుమించి అండగటానికి అతనికి ఏం తోచలేదు.

"ఇక మీరు వెళ్ళి పడుకోండి" అన్నది.

శంకరరెడ్డి కొంచెం సందేహించాడు. మీ రూం నెంబరు చెప్పండి. అవసమొస్తే ఎవరినన్నా పంపుతాం" అన్నది.

శంకరరెడ్డి చెప్పి, వచ్చి రూంలో పడుకున్నాడు. రెండురోజులు కంటిమీద కూర్కేలేదు. పడుకుంటూనే నిద్ర పట్టింది. లేచేసరికి ఎనిమిద యింది. ఎట్లావుందో ఏమో త్వరగా వెళ్ళాలని, పళ్ళు తోముకుంటు న్నాడు. నర్సు వచ్చింది. ఆమె ముఖంమీద నవ్వుచూసి శంకరరెడ్డి గాభరా పడలేదు.

"ఇప్పుడే లేచారా ?

శంకరరెడ్డి తలూపాడు." డ్యూటీ అయింది "వెళ్తున్నాను" అంది.

"ఇంటికివెళ్ళి నిద్రపోతార"ను కుంటాను. ఇంట్లో రాత్రిళ్లు ఎట్లా మేలుకుంటారు? అన్నాడు.

"ఆమె నవ్వి" "అలవాటయిపోయింది" అన్నది.

శంకరరెడ్డి ఆమెవైపు చూచేడు. ఈ మూడురోజులు తాను గమ నించనే లేదు. థెరిసా చాలా అందమైంది. అరుదైన సౌందర్యం ! ఎంత సేపు చూసినా చూడాలనిపించే సౌందర్యం.

"మీ భర్త ఏం చేస్తారు ?" అన్నాడు.

"వారు లేరు. చనిపోయారు" అంది దిగులుగా.

శంకరరెడ్డి హృదయం కలుక్కుమన్నది. పెద్ద వయస్సు కాదు. మహావుంటే పాతికేళ్ళు. ఈ వయసుకే ఆమె జీవితం వక్రించాలా ? శంకరరెడ్డి బోయ్‌ని కేకేసి కాఫీ తెప్పించాడు.

"రోగులకు సంబంధించిన వ్యక్తులు. ఏం ఆఫర్ చేసినా తీసుకో కూడదు. మీకు తెలియదేమో అంది" ఆమె నవ్వుతూ.

"క్రమశిక్షణని పాటించడంలో, కమ్యూనిస్టులకన్నా కాథలిక్కులు గట్టివారని నాకు తెలుసు, స్నేహితుడుగా ఆఫర్ చేస్తున్నాను. "తీసుకోండి" అన్నాడు,

కాఫీ తాగి ఆమె "వెళ్తాను నిద్ర ముంచుకొస్తోంది" అన్నది.

"మళ్ళీరాత్రికి వస్తారుగా డ్యూటీకి" అన్నాడు.

"ఇవ్వాల్టితో నైట్ డ్యూటీ అయిపోయింది. మళ్ళా రేపుదయమే హాస్పిటల్‌కు వచ్చేది" అన్నది.

కథా నిలయం
1415
శ్రీకాకుళం

"మీరు ఎక్కడుంటున్నారు ?"

"మా యింటికి వస్తారా ? సాయంత్రం రండి! మీకు కాఫీ యిచ్చి బాకీ తీర్చుకుంటాను ?" అంటూ ఇంటి అడ్రసు చెప్పింది.

నిజానికి శంకరరెడ్డి ఆమె యింటికి వెళ్ళాలని అడగలేదు ఊరికే అడిగేడు, హాస్పిటల్‌కు వెళ్ళాడు, భార్య జబ్బులో గుణం కన్పించింది. అతనికి ఏమీ తోచలేదు. నాలుగింటికి థెరిసా యిచ్చిన అడ్రసు జ్ఞాపకం చేసుకొని వెళ్ళాడు. ఆమె శంకరరెడ్డిని చూసి ''వచ్చారా రండి'' అంటూ ఆహ్వానించింది,

చిన్న యిల్లయినా ఎంతో పొందిగ్గా వుంది. గోడలకు జీసస్, మేరీ ఫోటోలున్నాయి. అంతకన్నా శంకరరెడ్డిని ఆకర్షించినది ఆమె చీరలో వుండటం అందానికి ఆకర్షణకి లొంగని సంస్కారంచాలా అరుదు! శంకరరెడ్డి సంస్కారం మాట మరచి, ఆమెను గుచ్చి గుచ్చి చూచాడు.

"కాఫీ తెస్తాను వుండండి" ఆమె వంటింట్లోకి వెళ్ళింది. కాఫీ తాగుతూ ''ఆమెకెట్టా వుంది?'' అన్నది.

"బాగుంది. ఇక భయం లేదనుకుంటాను?" అన్నాడు ఇక భయం లేదు. నాలుగు రోజుల్లో డిశ్చార్జి కూడా చేస్తారు. పదేళ్ళుగా ఈ వృత్తిలో వున్నాను. రకరకాల వ్యక్తుల్ని చూశాను. భార్యకోసం – మీలాగా తపించినవాళ్ళని నేను చూడలేదు. ఆ రెండు రాత్రిళ్ళు మీరు ఎవర్నీ గమనించలేదు. నేను మీ అవస్థ చూస్తూనే వున్నాను, మిమ్మల్ని చూచాక నా హృదయం కరిగిపోయిందండీ" అన్నది. ఆమె ఈ ప్రసక్తి తేవడం రెండోసారి. ఒక స్థితిలో ప్రవర్తనను, మరో స్థితిలో తలుచుకుంటే మనమేనా ఇట్లా చేసింది. అనిపిస్తుంది. శంకరరెడ్డికి అట్లాగా అనిపించింది. ఆ విషయమెత్తితే ఆడదానికిమల్లె సిగ్గుకూడా కలుగుతున్నది.

శంకరరెడ్డి అక్కడ ఒక గంట వుండి హాస్పిటలుకు వచ్చాడు. అతనికి ఇప్పుడు వార్డులో ఐదు నిముషాలుండటమంటేనే సిగ్గుగావుంటోంది. తన్ను గురించి థెరిసాలాగే అందరూ అనుకుంటూ వుండవచ్చు.

హాస్పిటల్లో భార్యనిచూచి, నేరుగా హోటలుకువెళ్ళి భోంచేసివచ్చి రూంలో పడుకున్నాడు. నిద్రరాలేదు. అతన్ని థెరిసాను గురించిన ఆలోచనలు పట్టుకున్నవి. ఆలోచనలకు బీజం సాయంత్రమే పడింది. ఏకాంతంలో వున్నప్పుడు ఏ ఆలోచనలు మొదట్లో ప్రవేశించినా ఒకంతట వైదొలగవు. ఆలోచనల్నుంచి ఎంత తప్పుకుందామనుకున్నా సాధ్యం కాలేదు. రాత్రి మనిషికిలేని ధైర్యాన్నీ ప్రోత్సాహాన్నీ యిస్తుంది. అతను డ్రస్సు చేసుకొని, గబగబా భూతం ఆవేశించినవాడిలా-థెరిసా యింటి దగ్గరకు వచ్చాడు. తీరా వాకిట్లోకి వచ్చిన తరువాత కొంచెం కొతుకు కలిగింది. అది ఒక క్షణం, ఇంట్లో అడుగు పెట్టాడు. ఆమె ఇంకా పడుకోలేదు. శంకరరెడ్డినిచూచి ఆశ్చర్యపోయింది.

ఆమె ఏదో ప్రశ్నించింది.

ఇతను ఏదో జవాబు చెప్పాడు.

మొత్తంమీద ఒకరిమాటలు మరొకరికి చెవులోకి దూరలేదు, ఇదరి మెదళ్ళలోనూ శూన్యం ప్రవేశించింది. శూన్యంలోనే ఒకరి భావాలొకరికి అస్పష్టంగా తెలిశాయి. అయిదు నిమిషాల తర్వాత గదినిండా చీకటి అయింది.

లైటు వెలిగాక, థెరీసాను చూచి, శంకరరెడ్డి కొంచెం షాక్ తిన్నాడు. ఆమె ఏడవటానికి సిద్ధంగా వుంది. ఆమెను ఆ స్థితిలో చూస్తుంటే శంకరరెడ్డికి ఏం మాట్లాడటానికి ధైర్యం చాల్లేదు.

"మీరు వెళ్ళండి" అని అంది ఆమె.

ఎంత ప్రయత్నం చేసి ఆ ముక్కని ఉచ్చరించలిగిందో — శంకరరెడ్డికి అర్థం కాకపోలేదు. ఏదో మాట్లాడాలని కాసేపు తటపటాయించాడు. ఆమె చేతుల్తో ముఖం కప్పుకుంది. ఏం మాట్లాడినా పరిస్థితి మరీ విషమించేట్టుంది. అతను గబగబా బయటకు నడిచాడు.

ఉదయం వార్డుకొస్తే థెరిసా కనిపించింది. శంకరరెడ్డిని చూచి ఆమె ముఖం వివర్ణమైపోయింది. అక్కడ చాలాసేపుంది. ఆమెను

యిబ్బందిపెట్టడం శంకరరెడ్డికి మనస్కరించలేదు. వెంటనే రూంకొచ్చి పడుకున్నాడు.

ఆమెలో వచ్చిన మార్పు శంకరరెడ్డికి అర్థంకాలేదు. రాత్రి అతను మళ్ళా థెరిసా యింటికి వెళ్ళాడు.

"మీరు మళ్ళావచ్చారా ? వెళ్ళండి. నన్ను వేధించకండి" అన్నది ఆమె. ఆమె కంఠంలో వణుకు స్పష్టంగా కనిపిస్తోంది.

మిమ్మల్ని వేధించాలనీ, బాధించాలనీ రాలేదు. నన్ను చూచేందుకు ఎందుకు భయపడతారు ? అన్నాడు.

ఆమె కాసేపు ఏం మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నదానిలా గంభీరంగా కూచుంది,

"మిమ్మల్ని తప్పుపట్టడంలేదు. మనిద్దర్నీ సైతాను ఆవేశించింది. పాపం చేశాం. ప్రభువుకు ఏం సమాధానం చెప్పాలి అక్కడ ? అంటూ ఆమె పైకి చూపించింది ఆమె కళ్ళలో నీళ్ళుకూడా నిలిచాయి.

"ఇలాంటి పనులన్నిటికీ సమాధానాలు రాబట్టటమే ఆ ప్రభువుపని అని నేననుకోవడం లేదు. అన్నాడు శంకరరెడ్డి.

థెరిసా శంకరరెడ్డివైపు ఆశ్చర్యంగా చూచింది.

"మీకు భగవంతుడిపైన విశ్వాసం లేనట్లుంది. పోనీ అంతరాత్మ అనేదన్నా ఒకటి వుంటుంది. దాని కన్నుగప్పి మనం ఏమీ చెయ్యలేం. అది మన పాపాల్ని మనకి జ్ఞాపకం చేస్తుంది. దాన్నుంచి ఎలా తప్పించుకుంటారు ? నిజంచెప్పండి. చేసిన తప్పుకు మీ అంతరాత్మ పరితపించడం లేదు ?" అన్నది ఉద్వేగంగా ఆమె.

అచ్చం మీ అంతరాత్మలాగే— అందరికీ వుంటాయని ఎందుకనుకుంటారు ? ఒక్కో మనిషికి ఒకో సంస్కారం వుంటుంది. ఆ సంస్కారానికి అనుగుణంగా అంతరాత్మ వుంటుంది. కాన్వెంటులో చదువుకున్న

వారికి-ఇదంతా అర్థమయ్యేట్టుగా చెప్పడం కష్టం. నా అంతరాత్మ మీలాగ బాధపడటంలేదు నమ్మండి" అన్నాడు. ఆమెకు నమ్మకం కలగలేదు.

"మీరు బుకాయిస్తున్నారు. కట్టుకున్న పెళ్ళానికి ద్రోహంచేశారు మీ అంతరాత్మ దానికి పరితపిస్తూనే వుంటుంది. పాపానికి పరిహారం పశ్చాత్తాప మని మీ మతం కూడా ఒప్పుకుంటు దనుకుంటాను. ఎందుకు మీరు పశ్చాత్తాపం చెందరు ?" అన్నది ఆమె ఆవేదనగా.

ఇదేదో పెద్ద ద్రోహంగా నేను భావించటం లేదు. పదేళ్ళక్రితం ఏ కారణాల వల్లో ఆమెభర్తని వదలిపేసింది. నేను పెళ్ళి చేసుకున్నాను. ఈ పదేళ్ళలోనూ ఒకటి రెండు సార్లు. నేను ఇట్లాంటి బలహీనతకి లోనుకావడం జరిగింది. ఆ విషయం ఆమెకు తెలుసు. ఆమెకూడా దీన్ని ద్రోహంగా తీసుకోలేదు. అన్నాడు శంకరరెడ్డి.

శంకరరెడ్డివైపు ఆమె ఆశ్చర్యంగా చూచింది.

"ఆమె ముఖంచూస్తే చాలా మంచిదిగా కనిపిస్తుంది. భర్తని వదలి వేసిందా ? అన్నది అనుమానంగా.

"ముఖాలు చూసి మంచిచెడ్డలు నిర్ణయించలేం. ఆమె భర్తను వదిలివేసి నంతమాత్రాన ఆమె చెడ్డది ఎందుకు అయిపోవాలి ? నాదృష్టిలో ఆమె ఇప్పటికీ మంచిది స్వోత్కర్ష అనుకోకపోతే - నేను కూడా దుర్మార్గుణ్ణికాదు. మంచివాణ్ణే.

మీరు కూడా మంచి వాళ్ళనే అనుకుంటున్నాను. మానవుడు స్వతహాగా సుఖాన్వేషి. ఆ యత్నంలో అతడు చేసిన ప్రతి పనీ పాపం కాదు, పశ్చాత్తాపం చెందవలసిన పనిలేదు నిన్నటి సంఘటనకు- లేనిపోని ప్రాముఖ్యమిచ్చి-మీరు బాధపడటం - నాకు బాధ కలిగిస్తున్నది. నా అంతరాత్మ పదే పదే మీ బాధని జ్ఞాపకం చేస్తున్నది. మీకు బాధ కలిగించినందుకు క్షమించండి" అని సెలవు పుచ్చుకున్నాడు.

థెరిసా అలాగే కూర్చున్నది. ఒకే సంఘటనపట్ల - రెండు అంతరాత్మలకు ఎందునా పొంతన లేకపోవడం - ఆమెకు ఆశ్చర్యాన్ని కలుగచేసింది !